# కవికేక

చైతన్య బోల్డు హడావిడి పడిపోతున్నాడు. మరి కవిగారికి సన్మానం చేసే శుభఘడియలు దగ్గర పడ్డాయి. కవిగారికి చైతన్యకూ ఏం సంబంధమంటే ఇతగాడు కర్నూలు కళాబంధు సాంస్కృతిక సంస్థకు సెక్రటరీ. ఎడారిలాంటి రాయలసీమలో ఇటువంటి సాంస్కృతిక సంస్థలే ఒయాసిస్సులు. వారి ఆశీస్సులతో అప్పుడప్పుడు కళాకారుల హృదయాలు ద్రవిస్తుంటాయి – రసహృదయుల కళ్ళు చల్లబడుతాయి.

తన అభిమాన ప్రత్యేక విప్లవ ప్రజాకవి 'కేక' గారికి సాహిత్య అకాడమీ అవార్డు రాగానే చైతన్య వారిని సన్మానించడానికి పూనుకున్నాడు. కాని చైతన్య మామూలు మనిషికాదు. ఏ పని చేసినా ఓ ప్రత్యేకత ఉండాలనుకుంటాడు. అందుకే 'కేక' గారి, సన్మానం చాలా గొప్పగా జరగాలని ఎన్నో హంగులు ఏర్పాటు చేశాడు. జనం పదికాలాల పాటు మరిచిపోకుండా ఉండాలని చందాలు దండి డబ్బు దండిగా ఖర్చుపెట్టదలిచాడు.

అందులో భాగంగా ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను అద్భుతంగా అలంకరింపచేశాడు. ఆడియెన్స్‌కూర్చోడానికి మంచి కుర్చీలు తెప్పించాడు. రంగు రంగుల దీపాలు ఏర్పాటు చేశాడు. అంతేకాదు, ఊళ్ళో కూడా 'కేక' గారు వచ్చే దారిలో స్వాగత ముఖద్వారాలు ఏర్పాటు చేశాడు. రంగు రంగుల బ్యానర్లు కట్టించాడు.

"ఏం గురూ! కవిగారు బయలుదేరారా?" రవి అడిగాడు.

"ఆ(! వచ్చేస్తున్నారుట – కారు పంపించారు."

"జనం గోలెడుతున్నారు. ఇప్పటికే అరగంట ఆలస్యం అయింది. మన మిచ్చిన పబ్లిసిటికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు కిటకిటలాడిపోతున్నారు."

"ఉదయం మద్రాసు నుంచి వచ్చిన దగ్గర్నుంచి ఆయన ఆరోగ్యం బాగాలేదు. మందులు తీసుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు." చైతన్య చెప్పాడు.

ఇంతలో అంబాసిడర్ కారు వచ్చి ఆగింది. పట్టువస్త్రాల్లో ధగధగా మెరిసిపోతూ కేక కవిగారు దిగారు. వారిని అనుసరించి పురప్రముఖులు కొందరొచ్చారు. చైతన్య సవినయంగా వారిని వేదిక దగ్గరికి తీసుకువెళ్ళాడు. 'కేక' గార్ని పరిచయం చేస్తూ చైతన్య ప్రజల నుద్దేశించి గొప్పగా ఉపన్యసించాడు.

"కేకగార్ని పరిచయం చేయడం ఏమిటి నా మొహం! ఇక్కడ వారు ఎవరికి తెలియరు? వారిని మనం ప్రత్యక్షంగా ఇక్కడే చూస్తున్నా – వారి కవిత్వం మన నరనరాల్లో జీర్ణించుకుపోయింది. తద్వారా వారు మన మనసుల్లో ఇల్లు కట్టుకుని ఉండిపోయారు. కృష్ణకుమార్ ఆనంద్ వారి అసలు పేరంటే చాలామందికి తెలియదు. వారు 'కేక 'గానే పరిచితులు, కారణం వారి కవిత్వం కేకలాగే గుండెల్ని కుదిపేస్తుంది. పేద ప్రజలమీద వారురాసిన ఆకలి కేకలకు సాహిత్య అకాడమీ వారు బహుమానం ఇచ్చి తమను తాము సత్కరించుకున్నారు. వారి పొలికేకలు ఈ రాష్ట్ర పొలిమేరలు దాటి పరుల భాషల్లోకి తర్జుమా అయ్యాయి – ఓ రాష్ట్రంగ్రాడ్యుయేట్ స్థాయిలో డీటెయిల్డ్ స్టడీకి సిలబస్‌లో చేర్చింది – అని చెబితే మీరు ఆశ్చర్యపోరని నే ననుకుంటున్నాను."

ఇలా కొనసాగింది చైతన్య ఉపన్యాసం 'కేక' గారిని ఆకాశాని కెత్తేస్తూ. ఆ తరువాత పెద్ద పెద్ద వాళ్ళు ఉపన్యసించారు. ఆ ఊరి ప్రముఖ రాజకీయ నాయకులైన రాజారావు కవిగార్ని ప్రశంసల పరంపరలో ముంచేశారు.

"...నాకు కవిత్వం రాయడం రాదు - కాని చదవడం వచ్చు - అసలు నేను కవిత్వం పట్ల ఆకర్షితుణ్ణయ్యానంటే కేవలం కేకగారి కవిత్వమేకారణం! నా బాల్యంలో ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం అని కేకగారంటే ఔననుకున్నాను."

జనంలోంచి ఎవరో అప్పటికి కేకగారు పుట్టలేదని అరిచారు. అటువంటి చిన్న విషయాలు పట్టించుకునేటటువంటి చిన్న మనిషి కాదు ఆయన.

"ఆయన కావ్యాలు రాశారు. ఆరేసుకోపోయి పారేసుకో లాంటి గొప్ప గిలిగింతలు పెట్టే గీతాలు చేశారు – ఏదేశ మేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి తెలుగు భారతిని లాంటి గేయాలు రాసి అందరి హృదయాల్ని గాయాలు చేశారు. ఓ ఇలా చెప్పుకుంటూ పోతే వారి చరిత్ర ఆంధ్ర కళామతల్లి చరిత్రే అవుతుంది..."

తల పట్టుకు కూర్చున్న కవిగారికి దుశ్శాలువ కప్పి. " దండలకు, అరదండాలకూ సన్మానాలకూ, మానాలకూ... సారీ అవమానాలకూ అతీతులు – కాని చంద్రుడి కోనూలుపోగులా వారి కో ఓ వెయ్యి న్నూటపదహార్ల పర్సు ఇస్తున్నాను." పర్సు అందించి

రాజారావు కుర్చీలో కూర్చున్నారు.

కవిగారు తన సన్మానానికి ప్రత్యుత్తర మివ్వడానికి లేచారు. వినయంగా సభికులందరికీ దండం పెట్టారు. చిన్నగా దగ్గి మైకు ముందుకు లాక్కున్నారు.

"అందరికీ వందనాలు. ఎందరో మహానుభావులు వారందరికీ కవితా హారతులు. రోడ్ల మీద పిచ్చికేకలు పెట్టుకుంటూ తిరిగే నన్ను కవి అని – ప్రజాకవి అని సన్మానించారు. కడుపు మండి ఆకలి కవిత్వం రాశాను. ఓ గొప్ప స్పృహ ఉన్న కవి అన్నారు. సమాజంలో నాకు జరిగిన అన్యాయాలకు పోలికేకలు పెట్టాను. అభ్యుదయ కవి – అన్నారు. ప్రభుత్వంలో ఉన్న లంచగొండితన్నాన్నీ ప్రజాస్వామ్య విరుద్ధ చర్యలనూ దుమ్మెత్తిపోశాను. విప్లవ కవిఅన్నారు నన్ను. డబ్బు కోసం కొన్ని బూతులు రాశాను. శృంగార కవి అని మెచ్చుకున్నారు. జ్వరం వచ్చి స్పృహ తప్పినప్పుడు నా ప్రేలాపనను నాభార్య కాగితం మీద కెక్కించింది. దాన్ని అబ్బో భావితరాల కవిత్వం అని మెచ్చుకున్నారు. ఇంతటి మీ విశాల హృదయానికి నా జోహార్లు ... "అంటూ కొనసాగించాడు.

ప్రేక్షకుల నుంచి చప్పట్లు మారుమ్రోగుతున్నాయి.

"కార్యనిర్వాహకులు నా సన్మానం సందర్భంగా ఆంధ్రలోని గొప్ప రంగస్థల నటులను, డాన్సర్లను పిలిపించి ఈ కార్యక్రమం తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చాలా సంతోషం. మాటల సందర్భంలో చైతన్యగారు చెప్పారు – నా సన్మానానికి దాదాపు మొత్తం ఖర్చు ఏభై వేలు రావచ్చుని. నాకోసం ఏభైవేలు ఖర్చు చేస్తున్న మీ అందరికి ఆజన్మాంతం ఋణపడి ఉంటాను – కాని నాకు సన్మానం చేయకుండా ఇప్పుడైన ఖర్చులో సగం – అంటే పాతిక వేలు నా కిచ్చుంటే – మీ అందరికీ వచ్చే జన్మకు కూడా ఋణపడి ఉండేవాడిని". అని చెప్పి కేకగారు మంచినీళ్ళు అందుకున్నారు దప్పికతో.

"కేక డౌన్ డౌన్!"

"డబ్బు కవి ముర్దాబాద్!"

"సొమ్ము వ్యామోహంలో పడే ప్రజాకవి, సిగ్గు సిగ్గు !" ప్రజల్లోంచి అరుపులు- కేకలు.

"రసజ్ఞులారా నా మీద మీకున్న అపోహలు తొలగిపోయాయి కదూ! కవికి కంఠమే కాదు,

కడుపూ ఉంటుంది. గొంతుతో పాటు గొంతెమ్మ కోర్కెలు – గంపెడు సంసారం ఉంటాయి. కవిత్వమే కాదు, కవి అన్నం కూడా తినాలి – తన సంసారాన్ని పోషించాలి. వీటన్నిటికీ డబ్బుకావాలి. మన దేశంలో ఏ కవీ కవిత్వం రాసుకుని బతకలేడు. నే చెప్పిన పాతిక వేలే ఉంటే – నా భార్య ఆపరేషనుకు డబ్బు లేక కొన్నిరోజుల్లో మరణించబోదు. ఇలా కుళ్ళి కుళ్ళి మంచం మీద చావబోదు. నాకొడుకు ఫీజు కట్టలేక చదువుమానెయ్యడు. పెళ్ళి కావలసిన వయసులో నాకూతురు ఇల్లిల్లూ తిరిగి బట్టలు కుట్టి డబ్బు సంపాదించదు. పోషకాహారం లేక మా ఆరోగ్యాలు ఇలా చెడిపోవు. బకాయిపడిన అద్దె చెల్లించలేక ఓనరు ఎదుట తల దించుకుని బతికే బతుకు ఉండేది కాదు. కాని మీరు ఇచ్చిన ఈ పర్సు కొన్ని రోజులు మా కుటుంబాన్ని ఆదుకుంటుంది. అందుకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు! ” గాద్గదికంగా అంటూ కుర్చీలో కూర్చుని కండువాతో కన్నీళ్ళు తుడుచుకున్నారు కవికేకగారు.

ప్రేక్షకు లందరితో పాటు చైతన్య కూడా చైతన్య రహితంగా ఉండిపోయాడు.

(ఆంధ్ర ప్రభ సచిత్ర వార పత్రిక)

